
ప్రత్తిపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముద్రగడ గిరిబాబు


గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పింస్తున్న ఎంపీపీ దొరబాబు


వీరవరంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న రాంజీ


అన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు


హంసవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి, మాట్లాడుతున్న కిరణ్ కుమార్

క్లుప్తంగా

భూపతిపాలెం విద్యార్థులకు నీటి కష్టాలు


ట్యాంకు ద్వారా నీటిని పట్టుకుంటున్న భూపతిపాలెం విద్యార్థులు

గోకవరం: భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు గత రెండు రోజులుగా నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో మార్పు కారణంగా ఈదురు గాలులు వీయడంతో పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రెండు రోజుల పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం గుర్తించిన పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గల్లా రాము, ఇతర సభ్యులు పాఠశాలకు సోమవారం రెండు నీటి ట్యాంకులు, 40 వాటర్ టిన్నులు సమకూర్చారు. దీంతో విద్యార్థులు కాస్త ఉపసమనం పొందారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ వితరణ


ఎల్లీపేట ఎంపీపీ స్కూలుకు స్మార్ట్ టీవీ అందిస్తున్న దాత కృపానందం

కోటనందూరు: ఎల్లీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి స్మార్ట్ టీవీ బహూకరించారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి ఏలేటి కృపానందం తన సొంత నిధులు రూ.20 వేలతో స్మార్ట్ టీవీ కొనుగోలు చేసి పాఠశాల ఉపాధ్యాయులు చెక్కా నాగేశ్వరరావు, పంచాడ అర్జునరావులకు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలకు ఇచ్చిన స్మార్ట్ టీవీ మరమ్మతు గురైందని, విద్యార్థుల అవసరార్థం టీవీ సమకూర్చాలని పీఎంసీ సమావేశంలో ఉపాధ్యాయులు చేసిన అభ్యర్థన మేరకు దాత టీవీ అందజేశారు. దాత కృపానందంను ఎంఈఓలు శ్రీనివాస్, మామిడి రామశేఖర్ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

అట్టహాసంగా విదేశీ న్యూ ఇయర్ వేడుకలు


న్యూ ఇయర్ వేడుకల్లో నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో విదేశీ న్యూ ఇయర్ వేడుకలు సోమవారం ఆ దేశ విద్యార్థులు అట్టహాసంగా జరుపుకొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్యాలతో అలరించారు. నేపాల్, బంగ్లాదేశ్ జాతీయ గీతాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఇంటర్‌నేషనల్ రిలేషన్ డైరెక్టర్ పరంజిత్ సింగ్, సీనియర్ మేనేజర్, ఇంటర్‌నేషనల్ అడ్మిషన్స్ మహ్మద్ సమీమ్ జాఫర్, ఇంటర్‌నేషనల్ అడ్మిషన్స్ పవన్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదేశ సంప్రదాయ వంటకాలతో విద్యార్థులకు విందు ఏర్పాటు చేసినట్టు ఆదిత్య యాజమాన్యం తెలియజేసింది.

యనమల కృష్ణుడి పరామర్శ


దానవాయిపేటలో పార్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృష్ణుడు

తొండంగి: దానవాయిపేటలో ఇటీవల అకాల మరణం చెందిన వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు సోమవారం పరామర్శించారు. దానవాయిపేట గ్రామానికి చెందిన మడదా శ్రీను భార్య పార్వతి ఇటీవల అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో యనమల కృష్ణుడు పార్టీనాయకులతో కలిసి శ్రీనును పరామర్శించారు. పార్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సిపేట గ్రామంలో బెనుగు ధనరాజ్ తండ్రి జగన్నాథం ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి తన సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, దానవాయిపేట సర్పంచ్ మడదా తిరుమలకుమారి, మడదా పరమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ మడదా హేమంత్, ఎల్లయ్యపేట సర్పంచ్ సింగిరి సింగరావు, చొక్కా కోదండ తదితరులు ఉన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

- వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు ముద్రగడ పద్మనాభం
- వాడవాడలా అంబేడ్కర్‌కు ఘన నివాళులు


పారుపాకలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు


కిర్లంపూడి హరిజనపేటలో వేడుకల్లో పాల్గొన్న ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

• కిర్లంపూడి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) సభ్యుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వాడవాడలా అంబేడ్కర్ జయంతిని నిర్వహించి, ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభంతోపాటు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు స్థానిక ఏనుగువీధి, కిర్లంపూడి హరిజనపేటలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలిత కేక్‌ను కట్ చేసి పంచారు. సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, అంబేడ్కర్ యూత్ సభ్యులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో ఆర్డినేటర్ తోట నరసింహం తనయుడు తోట రాంజీ వీరవరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

• గండేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గండేపల్లి సర్పంచ్ రుత్తల లలిత, ఎంపీడీఓ నాతి బుజ్జి తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రామంలో పేదలకు రైస్ ప్యాకట్లు పంపిణీ చేశారు. మురారిలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, ఉప సర్పంచ్ జాస్తి వసంత్, తదితరులు నివాళులర్పించారు.

• రౌతులపూడి: మండలంలోని పారుపాక ఎస్సీపేటలోను, రామాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలవద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రౌతులపూడిలో జైబీమ్‌యూత్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. రౌతులపూడి ఎస్ఐ జి.వెంకటేశ్వర రావు, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. బలరామపురంలోని జైబీమ్ యూత్, ఇండియా మిషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ములగపూడి, ఎ.మల్లవరం, రాజవరం, గంగవరం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్.పట్నం, ఎస్.అగ్రహారం, గిడజాం, శృంగవరం, బంగారయ్యపేట, ఎం.చామవరం, పి.చామవరం గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

• శంఖవరం: మండల వ్యాప్తంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. శంఖవరం, కత్తిపూడి, నెల్లిపూడి, కొంతంగి, ఎస్.జగ్గంపేట, మండపం పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

• తుని రూరల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శనీయమని జైభీమ్ మాలమహానాడు వ్యవస్థాపకులు తంతటి కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం హంసవరం, టి.తిమ్మాపురం, తేటగుంట, లోవకొత్తూరు, డి.పోలవరం, చామవరం, ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం, కొలిమేరు, తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. హంసవరంలో జరిగిన కార్యక్రమంలో జైభీమ్ మాల మహానాడు వ్యవస్థాపకుడు కిరణ్ కుమార్ పాల్గొని సర్పంచ్ రాయి మేరీ అవినాష్‌తో కలసి అంబేడ్కర్‌కు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్‌లు అత్తి వెంకటరమణ, కాలిబోయిన జోగారావు, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

• తొండంగి: బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన భారతరత్న బి.ఆర్.అంబేడ్కర్ ఆశయసాధనకు యువత, అందరూ సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు అంగుళూరి సుశీలారాణి అన్నారు. కొత్తపాకలు గ్రామంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. స్థానిక మహిళలతో కలిసి ఆమె పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. శృంగవృక్షం, పి.ఇ.చిన్నాయపాలెంలలో జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాలపట్నం, కృష్ణాపురం, ఎ.వి.నగరం, పి.ఇ.చిన్నాయపాలెం, తొండంగి, పి.అగ్రహారం, శృంగవృక్షం, బెండపూడి గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

• కోటనందూరు: అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన అంబేడ్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని సర్పంచ్ జిగటాల వీరబాబు అన్నారు. భీమవరపుకోటలో సర్పంచ్ వీరబాబు అధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలు కొనియాడారు. బొద్దవరంలో ఆదియాంధ్ర యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు వేగి అప్పలనాయుడు, కోటనందూరులో నిర్వహించిన వేడుకల్లో గరిసింగు దొరబాబు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల వ్యాప్తంగా దళిత వాడల్లో వేడుకలు నిర్వహించారు.

• గోకవరం: మండలంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తాణాసెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, సుంకర వెంకటరమణ, తోలేటి రాంప్రసాద్, బిజ్జి రాజు, నరాలశెట్టి నర్శయ్య తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గోకవరంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సంజీవయ్యనగర్‌లో ఎంఎస్‌పీ నాయకుడు గరబారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కొత్తపల్లిలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదర్శ రైతులను సత్కరించారు.

• ప్రత్తిపాడు: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా జరిగాయి. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముద్రగడ కేక్ కట్ చేసి, వేడుకను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముద్రగడ గిరిబాబు పాల్గొని అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నియోజకవర్గ స్థాయి వివిధ కమిటీల అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, నడిగట్ల త్రిమూర్తులు, గొల్లపల్లి దొరబాబు, ఏడిద రెడ్డినాయుడు, సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పెద్ద అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, స్థానిక ఎంపీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఏపీఓ కుమారస్వామి, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి, నివాళులర్పించారు.స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ సూర్యఅప్పారావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

• ఏలేశ్వరం: స్థానిక పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, సుంకర రాంబాబు, శిడగం వెంకటేశ్వరరావు, గోళ్లనాగేశ్వరరావు, వాగు బలరామ్ పాల్గొన్నారు. స్థానిక పెద్దవీధి పార్కు వద్ద తదితర ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వినోద్‌మిశ్రా నగర్‌లో సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

• అన్నవరం: గ్రామంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. రావిచెట్టు సెంటర్, మాదిగ పేట వద్ద గల అంబేడ్కర్ విగ్రహాలకి ప్రత్తిపాడు సీఐ బీ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు ఇతరదళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నవరం గ్రామసర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్, వైఎస్ఆర్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• జగ్గంపేట: ప్రజాస్వామ్యానికి రాజ్యాంగంతో ప్రాణం పోసిన మహనీయుడు దాదా సాహెబ్ అంబేడ్కర్ అని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు,రాష్ట్ర పబ్లిసిటీ సెల్ జనరల్ సెక్రటరీ రామకుర్తి జగాల్, మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. ఇర్రిపాకలో వైఎస్సార్ సీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి జూపిడి ప్రభాకరరావు, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


గోకవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


భీమవరపుకోటలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ జిగటాల వీరబాబు


జగ్గంపేటలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం


ఏలేశ్వరంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వినోద్‌మిశ్రా పార్టీ శ్రేణులు

వైభవంగా తాడిపెద్దు అచ్చు మహోత్సవం

రౌతులపూడి: యాదవలు ఆరాధ్య దైవం సింహాద్రి అప్పన్నగా కొలిచే తాడిపెద్దు అచ్చుమహోత్సవాన్ని మండలంలోని పారుపాకలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు రోజులపాటు కృష్ణుడు గుడి వద్ద నిర్వహించిన ఈ ఉత్సవంలో భాగంగా వేద పండితులు ఆధ్వర్యంలో యాగం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, తాడిపెద్దుకు, మరొక ఆవుతో వివాహం జరిపించారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణ, బాణసంచా కాల్పులు, తప్పెటగుళ్లు, కోలాటం వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య తాడిపెద్దు అచ్చు కార్యక్రమం చేశారు. ఈ మహోత్సవాన్ని గ్రామ పెద్దలు ఆహ్వానం మేరకు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మండల పార్టీశ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణుడు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని తాడిపెద్దుకి పూజలు చేశారు. అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు.


పారుపాకలో తాడుపెద్దుకు పూజలు చేస్తున్న ముద్రగడ గిరిబాబు

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గిరిబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వాసిరెడ్డి జమీలు, పక్కుర్తి జయబాబు, పార్టీ నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సర్నం శ్రీను, శంఖవరం పార్టీ కన్వీనర్ నరాల శ్రీను, ప్రత్తపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు సకురు గుర్రాజు, ఆ పార్టీ నాయకులు కేదారిశెట్టి నాగేశ్వరావు, రాయిప్రసాద్, జిగిరెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


తునిలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


ప్రత్తిపాడులో అగ్ని మాపక శకట ప్రదర్శనను జెండా ఊపి ప్రారంభిస్తున్న సర్పంచ్ గుడాల విజయలక్ష్మి

తుని: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తం ఉండాలని తుని అగ్నిమాపక కేంద్రం అధికారి కె.రాముడు కోరారు. సోమవారం తుని అగ్నిమాపక కేంద్రంలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ముంబాయిలో గన్‌పౌడర్ ఓడలో జరిగిన అగ్ని ప్రమాదంలో అశువులు బాసిన వీరుల త్యాగానికి ప్రతీకగా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి నివాళులు అర్పిస్తున్నామని రాముడు అన్నారు. ప్రజలకు అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్నిమాపక సిబ్బంది సత్యనారాయణ, భాస్కరరాజు, రమణ, శ్రీనివాస్, సూర్యనారాయణ, ఎంవీ సత్యనారాయణ, సత్తిబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఏర్పాటైన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజి రత్నరాజు మాట్లాడుతూ గృహాలు, వ్యాపార సంస్థలు, పాఠశాలలు, తాత్కాలిక నిర్మాణాలు తదితర ప్రాంతాల్లో ప్రమాద నివారణ పద్ధతులు పాటించాలని కోరారు. ఈనెల 20వ తేదీ వరకు గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కేఎస్ఎన్ మూర్తి, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వారోత్సవాల్లో భాగంగా అగ్ని మాపక శకట ప్రదర్శనను సర్పంచ్ గుడాల విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత 1944 ఏప్రిల్ 14వ తేదీన ముంబాయికి చెందిన ఒక ఓడలో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన 66 మంది ఫైర్ బ్రిగేడర్ల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొద్దిసేపు మౌనం పాటించారు.

అకాల వర్షం.. మామిడికి నష్టం

ప్రత్తిపాడు: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు మామిడి పంటకు తీవ్ర నష్టం కలిగింది. భారీ ఈదురు గాలులు వీడయంతో పెదశంకర్లపూడి, టి.రాయవరం తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. మామిడి చెట్లు నేలకొరిగాయి. వర్షం వల్ల చేతికి అందిన మామిడి పంట నేలపాలయ్యిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు రైతుల బాధ వర్ణనాతీతం. కౌలు రైతులకు పంట నష్ట పరిహారం మంజూరు చేసి, ప్రభుత్వం ఆదుకోవాలని టి. రాయవరం గ్రామ సర్పంచ్ తటవర్తి సుబ్బారావు కోరుతున్నారు. ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయ. మండలంలోని పెదశంకర్లపూడిలో రాసంశెట్టి రాఘవమ్మ పెంకుటిల్లు పైకప్పు గాలులకు ధ్వంసమైంది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

రౌతులపూడి, కొడవలి గ్రామాలలోని 33 కేవీ విద్యుత్ లైన్లలోని ప్రత్తిపాడులో రెండు, రాచపల్లిలో ఒకటి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రత్తిపాడు, ధర్మవరం, పోతులూరు తదితర గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ స్తంభాలు ఆరు, ఎల్‌టీ లైన్లలోని మరో తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలకూలి, విరిగిపోయాయి. గృహ, మంచినీటి అవసరాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్టు విద్యుత్ శాఖ ఏఈ ఎ.శ్రీను తెలిపారు.


టీ రాయవరంలో నేలరాలిన మామిడి కాయలు

ముద్రగడకు శుభాకాంక్షలు

కిర్లంపూడి: వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ)లో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను సభ్యుడిగా నియమించిన నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చి ఆయనకు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, తాళ్లపూడి మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం, ఐటీవింగ్ జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, కొవ్వూరు మాజీ ఏఎంసీ డైరెక్టర్ సుంకర రంగబాబు, జిల్లా కాపు టీచర్ అసోసియేషన్ మెంబర్ కేశవరపు ఆదిశేషుడు తదితరులు కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీలో మెంబర్‌గా తమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను ఎంపిక చేయడంపై వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంను కలిసిన పశ్చిమ గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు

విజేతగా నిలిచిన ఏలేశ్వరం జట్టు

ఏలేశ్వరం: జైబీమ్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సోమవారం ఏలేశ్వరం జట్టు విజేతగా నిలిచింది. స్థానిక కంబాలపాలెం కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ టోర్నమెంట్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఏలేశ్వరం చైతన్యనగర్ టీమ్‌పై ఏలేశ్వరం గ్రౌండ్ టీమ్ గెలిచి విజేతగా నిలిచింది. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం ఏలేశ్వరం గ్రౌండ్ టీమ్, ద్వితీయస్థానం ఏలేశ్వరం చైతన్యనగర్ టీమ్, తృతీయస్థానం ఏలేశ్వరం కంబాలపాలెం జైబీమ్ జట్లు విజేతలుగా నిలిచాయి. టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్న పోటీలు రసవత్తరంగా సాగాయి. విజేతలకు మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోనాల వెంకటరమణ బహుమతులు అందజేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్‌సభ్యులు కుప్పాలకాశీ, ఎద్దు స్వామి, గుమ్మాల రాంబాబు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


షీల్డ్‌తో ఏలేశ్వరం గ్రౌండ్ టీమ్

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం


మీడియాతో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీద అరుపులు అరుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపిడి ప్రభాకరరావు తెలిపారు. జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆహ్వానం మేరకు పార్టీ ఆఫీసుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా జగ్గంపేటలో పార్టీ నేతలు, దళిత నేతలు చేసిన సంబరాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు జాన్‌వెస్లీ, జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్ బందారు రాజా, నేతలు పాల్గొన్నారు.

జాన్ వెస్లీని పరామర్శించిన జూపూడి

ఇటీవల మాతృమూర్తిని కోల్పోయిన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు జాన్‌వెస్లీ స్వగృహానికి జూపిడి ప్రభాకర వచ్చి ఆయన్ని పరామర్శించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: రావికంపాడు- గొల్లప్రోలు మధ్యలోని మల్లవరం రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని(45) వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాలు ప్రకారం.. మల్లవరం రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని లేక జారిపడి అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. మృతుడి వంటిపై వస్త్రాలు లేవని, ఎడమ చెయిపై టాటూ ఉందని, కుడి చేతికి స్టీల్ కడియం ధరించి ఉన్నాడని తెలిపారు. ఎస్సై శ్రీనివాసరావు పర్యవేక్షణలో అన్నవరం రైల్వే అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ శ్యాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడని చెప్పారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

గండేపల్లి: నీలాద్రిరావుపేటలో పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు గ్రామ శివారులో పోలవరం గట్టు వద్ద పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ఐదుగురు పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,400 నగదును స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించనున్నట్టు పేర్కొన్నారు.